సాక్షి కామారెడ్డి

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ఒకే బడిలో ఉపాధ్యాయులుగా..

తండ్రీకొడుకులు ఇద్దరూ ప్రభుత్వ టీచర్లే.. నాడు తండ్రి పనిచేసిన పాఠశాలలోనే నేడు తనయుడు విద్యాబోధన చేస్తున్నాడు.

- 8లో ▸



కొనసాగిన ఉత్సవం

జిల్లాలో ఉగాది ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు గ్రామాలలో ఎడ్లబండ్ల ఊరేగింపులు, భజనలు నిర్వహించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.6 /20.8

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గవచ్చు. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

65.54 శాతం ఆస్తి పన్ను వసూలు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియా పరిధిలో సోమవారం నాటికి 65.54 శాతం ఆస్తిపన్నులు వసూలయ్యాయి. బల్దియాలో రూ.13.56 కోట్ల పనులు వసూలు చేయాల్సి ఉండగా.. ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ. 8.89 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా రూ. 4.67 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. మొండి బకాయిలనూ వసూలు చేస్తామని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ రవిగోపాల్‌రెడ్డి తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



బీబీపేట : శివారు రాంరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులకు శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం సుభాష్‌రెడ్డి రూ. 3 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు చేరిన సన్నబియ్యం



బాన్సువాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అమలుకోసం సోమవారం బాన్సువాడ మండలానికి సన్న బియ్యం చేరాయి. బాన్సువాడ ఎంఎల్‌ఎస్ పాయింట్ పరిధిలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఉన్న 59 రేషన్ దుకాణాలకుగాను 650 టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యం సంచుల్లో రెండు, మూడు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నా రు. లబ్ధిదారులందరూ సన్న బియ్యం తీసుకెళ్తారని, బియ్యం తక్కువగా రావడంతో వాటిని ఎలా భర్తీ చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా పాలిసెట్ కోచింగ్

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ తెలిపారు. సోమవారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, నగరంలోని ఎస్‌ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఉచిత తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పేర్లను ఏబీవీపీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో పరిషత్ నగర కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్, దుర్గాదాస్, రంజిత, వినోద్, ఇంద్రసేన, జయేంద్రవర్ధన్ అలంకార్ పాల్గొన్నారు.

ఆగని మత్తు దందా



మత్తు దందాపై సర్కారు ఉక్కుపాదం మోపుతున్నా అక్రమార్కులు ఆగడం లేదు. గతంలో క్లోరోహైడ్రేట్ అక్రమ వ్యాపారం నిర్వహించగా.. ఇప్పుడు అల్ప్రాజోలంతో దందా నడిపిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆరాటంతో కొందరు కేసులకూ భయపడడం లేదు. దీంతో జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట పడడం లేదు.

- గతంలో క్లోరోహైడ్రేట్.. ఇప్పుడు అల్ప్రాజోలం
- కేసులకూ జడవని అక్రమార్కులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో గతంలో కల్లు తయారీలో క్లోరోహైడ్రేట్ వినియోగించేవారు. దీనిని ఇతర రాష్ట్రాలనుంచి తీసుకుని వచ్చేవారు. అయితే ఎక్కువ మొత్తంలో క్లోరోహైడ్రేట్ కలపాల్సి వచ్చేది. దీంతో క్వింటాళ్ల కొద్దీ ఈ మత్తు పదార్థం అవసరం అయ్యేది. దానిని రవాణా చేయడం రిస్క్‌తో కూడుకున్న పని. రవాణా కోసం ప్రత్యేక వాహనాలను వాడేవారు. పోలీసుల తనిఖీలనుంచి తప్పించుకునేందుకు జాగ్రత్తలు తీసుకునేవారు. మరోవైపు కల్తీ కల్లు తయారీలో అల్ప్రాజోలం కూడా వినియోగిస్తారు. క్లోరోహైడ్రేట్‌తో పోల్చితే ఇది చాలా తక్కువ పరిమాణంలో అవసరం ఉంటుంది. దీనిని రవాణా చేయడం కూడా సులువే.. ఈ నేపథ్యంలో వ్యాపారులు, కల్తీ కల్లు తయారీదారులు క్లోరోహైడ్రేట్‌ను కాకుండా అల్ప్రాజోలం వినియోగానికే మొగ్గుచూపుతున్నారు.

సులువుగా డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా..

మత్తు దందాలో చిక్కితే జైలుపాలవుతామని తెలిసినప్పటికీ, సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో కొందరు అల్ప్రాజోలం దందాలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. గతంలో కొందరు మత్తు పదార్థాల దందాలో పెద్ద ఎత్తున సంపాదించి ఆస్తులు కూడబెట్టుకున్నారు. వాళ్లను చూసి మరికొందరు ఈ దందాలోకి దిగారు. దొరకనంత వరకు డబ్బులు సంపాదించవచ్చని, ఒకవేళ దొరికినా నాలుగు రోజులు జైల్లో ఉండి వస్తామన్న ధోరణితో ఈ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు చిక్కుతున్నా..

జిల్లాలో మత్తు దందాపై ఐదారు నెలల కాలంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖలు నిర్వహించిన దాడుల్లో పదిమందికిపైగా చిక్కారు. వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు పెట్టారు. ఈ యాక్ట్ కింద కేసులు పెడితే శిక్షలు కఠినంగా ఉంటాయి. కనీసం రెండుమూడు నెలల వరకు బెయిల్ కూడా దొరకదు. నేరం నిరూపితమైతే కనీసం ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అయినప్పటికీ సులువుగా డబ్బులు సంపాదించడానికి అలవాటు పడినవారిలో మార్పు రావడం లేదు. పైపెచ్చు ఈ మత్తు దందా చేసేవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

తీగలాగితే కదిలిన డొంక

జిల్లాలో ఇటీవల అక్రమ ఫైనాన్స్ దందాపై పోలీసులు దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్నూర్ మండల కేంద్రంలో అప్పులు ఇచ్చే ఓ వ్యక్తి ఇంటికి పోలీసులు వెళ్లినపుడు.. సదరు వ్యాపారి పోలీసుల రాకను గమనించి అల్ప్రాజోలంను దాచిపెట్టడానికి యత్నించాడు. దీనిని గమనించిన పోలీసులు.. అతడిని పట్టుకుని విచారించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తీగలాగితే డొంక కదిలినట్టుగా హైదరాబాద్‌లో అమ్మిన వ్యక్తితో పాటు, తయారు చేయిస్తున్న వ్యక్తీ పోలీసులకు చిక్కాడు. మద్నూర్‌కు చెందిన మరో వ్యక్తికి సైతం అల్ప్రాజోలం సరఫరా చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దీంతో నలుగురిపై కేసు నమోదైంది. ముగ్గురు వ్యక్తులను పోలీసులు రిమాండ్‌కు పంపారు. మద్నూర్‌కు చెందిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.

కఠిన చర్యలు తప్పవు



నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, సరఫరా చేసినా, అమ్మినా, తయారు చేసినా చట్టప్రకారం శిక్షార్హులవుతారు. అలాంటివారిపై కఠిన చర్యలుంటాయి. మత్తు దందాతో డబ్బులు సంపాదించుకోవాలనుకుంటే జైలుపాలుకాక తప్పదు. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలి. – రాజేశ్ చంద్ర, ఎస్పీ

ఘనంగా ఈద్ ఉల్ ఫితర్

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు, పెద్ద బజార్, బతుకమ్మకుంట, గొల్లవాడ, అశోక్‌నగర్ కాలనీ, పాతబస్టాండ్ ప్రాంతాలలోని ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని షాహి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం, చరిత్రగతి మార్చిన వీరులను స్మరించుకోవడం పర్వదినాల్లో సర్వసామాన్య అంశం అన్నా రు. వీటితో పాటు మనిషికి క్రమశిక్షణ నేర్పి, ధర్మా న్ని, దయాగుణాన్ని ప్రబోధించే పండుగలలో రంజాన్ ఒకటి అన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, జిల్లా అధికారులు షబ్బీర్ అలీని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెరిగిన టోల్ చార్జీలు

- నేటి నుంచి అమలులోకి

ఇందల్వాయి: టోల్‌ప్లాజా చార్జీలు ఎప్పటిలాగే ఈ ఏడాది సైతం పెరిగాయి. గతంతో పోలిస్తే 3.5 శాతం పెరిగిన చార్జీలు మంగళవారం నుంచి అమలులోకి వస్తాయని ఇందల్వాయి టోల్‌ప్లాజా మేనేజర్ చలపతిరావు తెలిపారు. పెరిగినచార్జీలు ఇలా..



ఇందల్వాయి టోల్‌ప్లాజా

వాహనం	సింగిల్ జర్నీ (రూ.లలో)	రిటర్న్ జర్నీతో (రూ.లలో)	నెలవారీ పాస్ (రూ.లలో)
కారు, జీప్, వ్యాన్, లైట్ మోటార్ వెహికిల్స్	90	135	3,035
లైట్ కమర్షియల్ వెహికిల్, మినీ బస్	145	220	4,905
బస్సు, ట్రక్	310	465	10,280
నిర్మాణ రంగ వాహనాలు, ఎర్త్ మూవర్స్	485	725	16,120
భారీ వాహనాలు (ఏడు లేదా అంతకు ఎక్కువ చక్రాలు)	590	885	19,625

(టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వాహనాలకు నెలవారీ పాస్ రూ.350)

కుస్తీమే సవాల్

జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం కుస్తీపోటీలు జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చి పోటీలలో పాల్గొన్నారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. నిర్వాహకులు కొబ్బరి కాయ మొదలుకుని రూ. 2 వేల వరకు బహుమతులు అందించారు.



నస్రుల్లాబాద్‌లో తలపడుతున్న మల్లయోధులు

- మరిన్ని వార్తలు 8లో..

రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించండి

- గడువులోగా దరఖాస్తు చేసుకునేలా చూడండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కామారెడ్డి క్రైం : రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన కల్పించి, వీలైనంత ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అర్హులైన వారు 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులకు రూ. 50 వేలలోపు రుణాలకు 100 శాతం, రూ.లక్షలోపు రుణాలకు 90శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. కుటుంబంలో ఒక్కరికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 2 లక్షలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలను మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి నుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్డీవో సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దేవేందర్, పరిశ్రమల శాఖ జీఎం లాలూనాయక్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

చేసిన తప్పు ఊరకే పోదు

- కలకలం రేపిన అదనపు కలెక్టర్, ఇద్దరు ఉన్నతాధికారులపై కేసు
- ధాన్యం ఒకరికి ఇచ్చి.. సీఎంఆర్ మరొకరిని అడిగిన వైనం
- దుబాయ్‌కు చెక్కేసిన మాజీ ఎమ్మెల్యే షకీల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రజల పన్నులతో జీతాలు తీ సుకుంటున్న ఉన్నతాధికారులు ప్రజలకు సేవ చేయడంతో పాటు ప్రజల ఆస్తులను రక్షించడం, బా ధితులకు న్యాయం చేసేందుకు పనిచేయాలి. అయితే ఇందుకు విరుద్ధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో అధికారులు తగిన ఫలితం చవిచూడాల్సి వస్తోంది. బాధితుడి పోరాటంతో కోర్టు ఆదేశాల మే రకు ఐఏఎస్ అధికారితో పాటు మరో ఇద్దరు ఉ న్నతాధికారులపై కేసు నమోదైంది. తప్పుడు మా ర్గంలో వెళ్లేందుకు అధికారులను ప్రోత్సహించిన మాజీ ఎమ్మెల్యే షకీల్ మాత్రం దుబాయ్ వెళ్లి వ్యా పారాలు చేసుకుంటున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్ రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. 2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిషోర్ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు ఉన్నతాధికారులు చూపించారు. మరింత ముందుకెళ్లి సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసేలా కథ నడిపించారు. కథ ఇంతటితో ఆగలేదు. ధాన్యం షకీల్ మిల్లుకు పంపించి, కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను కిషోర్‌కు చెందిన శ్రీనివాస రైస్ మిల్లు నుంచి ఇవ్వాలని ఒత్తిడి తేవడం గమనార్హం. ఈ విషయమై కిషోర్ నెలల తరబడి పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు కోర్టు ఆదేశాలతో ఉన్నతాధికారులపై కేసు నమోదైంది.

■ 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకు గాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబయి, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. ఓ 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో పాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు.

మరోవైపు కిషోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసే కథ నడిపిన అధికారులే సీఎంఆర్ కిషోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తూ రావడం విశేషం. ఈ విషయంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని షకీల్ దండుకున్న ధాన్యం డబ్బులను రికవరీ చేసేందుకు కృషి చేస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే అదనపు కలెక్టర్, మాజీ డీసీవో, డీటీలపై కేసులు నమోదయ్యాయి.



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అధికారంలో ఉన్న సమయంలో..

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కోట్లాది రూపాయల విలువజేసే ధాన్యాన్ని ప్రభుత్వం వద్ద తీసుకుని ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారీతిన దందా చేశాడు. మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిషోర్ మిల్లు నుంచి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించాడు. అయితే అధికారం పోవడంతో షకీల్ తక్షణమే దుబాయ్ వెళ్లిపోయాడు. జిల్లాలో మొత్తం 41 మంది మిల్లర్లను ప్రభుత్వం డిఫాల్టర్లుగా ప్రకటించింది. ఈ మిల్లర్లు రూ.417 కోట్ల విలువ చేసే కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇందులో ఒక్క షకీల్ నుంచి రావాల్సిన బియ్యం విలువే రూ.60 కోట్ల మేర ఉండడం విశేషం.

అమ్మకు బోనం..

గోపాల్‌పేటలోని నల్ల పోచమ్మ ఆలయంలో సోమవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గోపాల్‌పేట, చీనూర్, బంజర గ్రామాల నుంచి భక్తులు బోనాలను తీసుకుని శోభాయాత్రగా వచ్చారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. కాగా బోనాల ఊరేగింపులో ఏలూరు నుంచి వచ్చిన కాంతారా ట్రూప్ కళాకారుల ప్రదర్శనతోపాటు పోతరాజుల విన్యాసాలు అలరించాయి. – నాగిరెడ్డిపేట



కాంతారా ట్రూప్ కళాకారుల ప్రదర్శన



నల్లపోచమ్మ ఆలయానికి బోనాలతో శోభాయాత్రగా వెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి: మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనూష తెలిపారు. గణితం, బోటనీ, జువాలజీ , కెమిస్ట్రీ, కామర్స్, పొలిటికల్ సైన్స్ బోధించేందుకు మహిళా లెక్చరర్లు కావాలని పేర్కొన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తామని తెలిపారు. ఇది పూర్తి తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకమని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 2న(బుధవారం) ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ, డెమో కోసం కళాశాలకు రావాలని తెలిపారు.

తల్లిని కోల్పోయిన చిన్నారికి చేయూత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఇటీవల తల్లిని కోల్పోయిన చిన్నారికి కోనేరు ట్రస్టు అండగా నిలుస్తుందని బీజేపీ నాయకులు తెలిపారు. మండలానికి చెందిన మానస చికిత్స పొందుతూ ఇటీవల మరణించింది. ఆమెకు 15 రోజుల చిన్నారి ఉంది. ఈ విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ సోమవారం బాధిత కుటుంబానికి ప్రాథమికంగా రూ. 5వేలు ఆర్థిక సహాయం పంపించారు. చిన్నారికి ప్రతి ఏడాది ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కోటగిరి, రుద్రూర్ మండలాల బీజేపీ అధ్యక్షులు ఏముల నవీన్, అలపాటి హరికృష్ణ, మాజీ వార్డు సభ్యుడు మామిడి శ్రీనివాస్, ఏముల కాశీరాం, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పదాధికారుల సమావేశంలో జిల్లా నేతలు



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన పదాధికారుల సమావేశానికి జిల్లా నేతలు హాజరయ్యారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిలో..



ముంబోజీపేటలో..



నస్రుల్లాబాద్‌లో..

రసవత్తరంగా కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్/బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట: జిల్లాలోని పలు గ్రామాల్లో ఉగాది ఉత్సవాల్లో భాగంగా సోమవారం వీడీసీల ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో జరిగిన పోటీల్లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి గ్రామ కమిటీ సభ్యులు నగదు బహుమతి అందించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి మొదలుకొని రూ.2000 వరకు పోటీలు జరిగాయి. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలకు ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్ మండలాలకు చెందిన మల్లయోధులు హాజరయ్యారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి 3 తులాల వెండి చైన్ వరకు పోటీలను నిర్వహించారు. లింగంపేట మండలం ముంబోజీపేట గ్రామంలో టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు.



తాడ్కోల్‌లో కుస్తీపడుతున్న మల్లయోధులు

నేడు కోమలంచ గ్రామంలో..

నిజాంసాగర్ (జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం కొమలంచ గ్రామంలో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కుస్తీ పోటీలకు మల్ల యోధులు తరలి వచ్చి జయప్రదం చేయాలని గ్రామస్తులు కోరారు.

రేపు లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం రథోత్సవం, సాయంత్రం కుస్తీపోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు కుస్తీ వీరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మందుబాబులకు అడ్డాగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు



రాజంపేటలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

రాజంపేట: మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం మందుబాబులకు అడ్డాగా మారింది. గత ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేయగా, ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. దీంతో ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. మద్యం తాగుతూ సీసాలను ఇళ్లలోనే పడేస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రోడ్డు, నీటి వసతి, విద్యుత్ వంటి మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు అయినట్లు సమాచారం . కానీ అధికారికంగా అక్కడా ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల లోపల మద్యం సీసాలు

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పూర్తయ్యేదెన్నడు?



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు పనులు అర్ధంతరంగా నిలిచాయి. ప్రభుత్వం మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లును నిర్మించడానికి రూ.5లక్షలు మంజూరు చేసింది. ఇల్లు నిర్మించడానికి కేటాయించిన స్థలంలో హౌజింగ్ అధికారులు కొలతలు చేసి మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసిన నెలకు పనులు ప్రారంభించారు. సిమెంటు, కంకర వేసి 12రోజుల గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు జరుగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మోడల్ ఇల్లు నిర్మాణం పూర్తయితే ఈ ఇల్లును చూసి తమ ఇళ్లను ఎలా నిర్మించుకోవాలో తెలుస్తుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొందరగా మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిగా నాడు తండ్రి.. నేడు కొడుకు

ఒకే పాఠశాలలో విద్యాబోధన..



బాలయ్య (ఫైల్)

మాచారెడ్డి: తండ్రీకొడుకులు ఒకే పాఠశాలలో విద్యా బోధన చేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. రాజన్న-సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన వేషాల బాలయ్య లచ్చపేట ఉన్నత పాఠశాలో 1993–1995వరకు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆయన పని చేసిన సమయంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దాడు. తదుపరి బాలయ్య అనారోగ్యానికి గురికావడంతో బాలయ్య కుమారుడు శ్రీనివాస్ విద్యావలంటీర్‌గా ఇదే పాఠశాలలో 1995–1996 వరకు పనిచేశాడు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి గంభీరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. 2023 నవంబర్‌లో డిప్యుటేషన్‌పై వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించాడు. 2024 అక్టోబర్‌లో రెగ్యులర్ ఉపాధ్యాయుడిగా ఇదే పాఠశాలకు బదిలీపై వచ్చాడు. అప్పటి నుంచి ఇదే పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. నాడు తండ్రి, నేడు తనయుడు ఒకే పాఠశాలలో పనిచేయడం ఆసక్తికర విశేషం.



లచ్చపేట ఉన్నత పాఠశాల

ఆనందగా ఉంది



మా నాన్న పనిచేసిన పాఠశాలలో నేను ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. మానాన్న చదువు చెప్పిన నాటి విద్యార్థుల కుమారులకు, కుమార్తెలకు నేను విద్యాబోధన చేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది. – శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, లచ్చాపేట

త్రిభువన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు

బోధన్: లోక్‌సభలో త్రిభువన్ సహకార విశ్వ విద్యాలయం బిల్లు–2025 ఆమోదం పొందడం చరిత్రాత్మక ముందడుగని క్రిబ్ కో(క్రిషక్ భారతి కో–ఆపరేటివ్ లిమిటెడ్) జిల్లా మేనేజర్ సీహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. సాలూర మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా గుజరాత్‌లోని ఐఆర్‌ఎంఏ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్) సంస్థ త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయంగా మారనున్నట్లు తెలిపారు. ఇది తొలి జాతీయ సహకార విశ్వవిద్యాలయంగా ఆవిర్భావించనున్నదని పేర్కొన్నారు. సహకార రంగానికి నైపుణ్యం కలిగిన నిపుణులను తయారు చేసి అందించడమే ఈ విశ్వవిద్యాలయ లక్ష్యమని వివరించారు. సహకార మార్కెటింగ్, గ్రామీణ క్రెడిట్, పాడి, మత్స్య పరిశ్రమలపై డిగ్రీ, డిప్లొమాలు, శిక్షణ, పరిశోధనలు అందిస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ రెడ్డి

‘విద్యార్థులపై దాడి సిగ్గుచేటు’

తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడు బీ శివ తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతిష్టాత్మక హెచ్‌సీయూకి సంబంధించిన 400ల ఎకరాల భూమిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. రాత్రివేళలో వర్సిటీ భూములను పొక్లెయినర్లతో చదును చేసే ప్రయత్నంపై ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపగా, ప్రభుత్వం పోలీసుల ద్వారా వారిపై లాఠీచార్జి చేయించడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులపై దాడులు చేయించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షులు తరుణ్, సమీర్, రాము, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ

ప్రజా మరుగుదొడ్లేవి?

- బిచ్కుందలో సులభ్ కాంప్లెక్స్ లేక మండల ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు





బిచ్కుంద మండల కేంద్రంలో అధ్వానంగా మారిన పరిసరాలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చేవారి సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది.

పెరుగుతున్న వ్యాపారం, జనాభాకు అనుగుణంగా మండల కేంద్రంలో అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల కేంద్రంలో ఎక్కడ ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. గ్రామ స్వచ్ఛతకు అందరు సహకారం అందించాలి, బహిరంగ ప్రదేశాల్లో మూత్రవిసర్జన చేయవద్దని పంచాయతీ అధికారులు ప్రచారం చేస్తున్నారు. కానీ ఎక్కడ కూడా ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. ఇతర గ్రామస్తులు, దుకాణాల్లోని సిబ్బందికి ఎవరికైనా ఒంటికి, రెంటికీ వస్తే ఆర్టీసీ బస్టాండ్‌కు రావాల్సిందే. వ్యాపారులు దుకాణాలను వదిలి ఇంటికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. పలువురు ఖాళీ స్థలాల్లో మూత్రవిసర్జన చేపట్టడంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో కనీసం రెండు సులభ్ కాంప్లెక్స్ నిర్మించి, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..



మండల కేంద్రంలో పలువురు బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం బిచ్కుందలో సులభ్ కాంప్లెక్స్ కావాలని ఉన్నతాధికారులకు గతంలో ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం రెండు సులభ్ కాంప్లెక్స్‌ల అవసరం ఉంది. సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. – శ్రీనివాస్‌గౌడ్, జీపీ కార్యదర్శి, బిచ్కుంద

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పరిధి గౌతంనగర్‌కు చెందిన రంగాల కనకయ్య(48) అదృశ్యమైనట్లు భార్య లక్ష్మి ఆదివారం తెలిపారు. మార్చి 25న ఇంటి నుంచి వెళ్లిన కనకయ్య తిరిగి రాలేదని, చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. మార్చి 27న మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

ఎడపల్లి(బోధన్): ముందుకెళ్లేందుకు దారి వ్వాలని హారన్ కొట్టిన ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వస్తుండగా పోచారం గేటు వద్ద ముందు వెళ్తున్న బైక్ సైడ్ ఇవ్వాలంటూ డ్రైవర్ హారన్ ఇచ్చాడు. దీంతో ఆగ్రహించిన సల్మాన్, ముఖీద్ అనే ఇద్దరు యువకులు బస్సును దూపల్లి గేటు వద్ద బస్సును ఆపి హారన్ ఎందుకు కొట్టావంటూ బూతులు తిడుతూ డ్రైవర్, కండక్టర్లపైకి దాడికి పాల్పడ్డారు. డ్రైవర్ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి ఒకరి మృతి



మహేందర్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మార్చి 30న చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మచ్చ మహేందర్(48) ఉగాది రోజున మామిడి, వేప ఆకుల కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. కాగా, మహేందర్ 31న(సోమవారం) చెరువులో మృతదేహమై కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మహేందర్ ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో చెరువు వద్ద కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మచ్చ రజిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహేందర్ ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి మెడికల్‌లో పనిచేసేవాడని, భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బోధన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెగడపల్లి నుంచి బోధన్ వైపు మార్చి 29న ఉదయం కాలినడక వస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బర్దీపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందాడని, దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన నాగేశ్ (38) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారం రోజుల క్రితం ఇంట్లో గొడవ కావడంతో నాగేశ్ భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పులు ఎక్కువ కావడంతోపాటు మద్యానికి బానిసైన నాగేశ్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన జడల రమేశ్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. రమేశ్ గతంలో తండ్రిని చంపిన కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై దొంగతనాలు చేస్తుండేవాడు.

ఈ క్రమంలో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు రోజుల కిత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రమేశ్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. సోమవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిధులు రాక నిలిచిన పనులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో టాయిలెట్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పాఠశాలలో సుమారు 180 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారందరికి ఒక్కటే టాయిలెట్ ఉంది. దీంతో మల మూత్ర విసర్జనకు నిత్యం విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈక్రమంలో ప్రభుత్వం గత ఏడాది 10టాయిలెట్లను మంజూరు చేయగా, నిధులు రాకపోవడంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో పేరెంట్స్ కమిటీ సభ్యుడు ముందుకు వచ్చి నిర్మాణ పనులు ప్రారంభించాడు. కానీ నిధులు రాకపోవడం , అధికారులు పట్టించుకోకపోవడంతో పనులను వదిలేశారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బోర్లం జెడ్పీహెచ్ఎస్‌లో పునాది దశలోనే నిలిచిన టాయిలెట్ పనులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666. [SCA25002404]

WANTED

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు వర్క్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. P/T, F/T అవకాశాలు కలవు. 9014124476. [G-230]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆకట్టుకుంటున్న సబ్ కలెక్టర్ ఆఫీస్



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పరుచుకున్న పచ్చదనం

బాన్సువాడ: బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పచ్చదనం అల్లుకుంది. గత ప్రభుత్వ హయాంలో రూ. 1.50కోట్లతో ఈ కార్యాలయంను నిర్మించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం పక్కన తహసీల్ కార్యాలయం కొనసాగుంది. ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటి పచ్చదనం ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయం పచ్చదనంతో ఆకట్టుకుంటుంది. రోడ్డుపై వెళ్లే ప్రజలు సైతం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందున్న గ్రీనరి చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ బడిని బతికించండి



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలో తిరుగుతూ సర్కార్ బడిలో మీ పిల్లలను చదివించి బడిని బతికించండి అంటూ వేడుకున్నారు. సోమ వారం గ్రామంలో వీడీసీ, వివిధ సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలు తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించి బడిని కాపాడుకోవాలని కోరారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎంలు మంత్రి రమేశ్, ఓటర్కర్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కసుతోనే చంపేశారు

- బాలుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో కిడ్నాప్‌కు గురైన బాలుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. చిన్నపిల్లలు ఉండడంతో భిక్షాటనలో తోటి మహిళ తమకంటే ఎక్కువ సంపాదిస్తోందనే అక్కసుతో తల్లీకొడుకులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. సీపీ పోతరాజు సాయి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాబాది బిలోలికి చెందిన కమలాబాయి రంజాన్ నేపథ్యంలో మార్చి 27న భిక్షాటన కోసం ముగ్గురు పిల్లలతో కలిసి నిజామాబాద్‌కు వచ్చింది. ఇద్దరు కూతుళ్లు శివాని, రోజా భిక్షాటన అనంతరం బస్టాండ్‌లో పడుకోగా, కమలాబాయి తన 14 నెలల కొడుకు కైలాశ్‌తో రైల్వే స్టేషన్‌లో నిద్రించారు. తెల్లవారుజామున కైలాశ్ కనిపించకపోవడంతో తల్లి ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మార్చి 28న మూడో టౌన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ పక్కన కైలాశ్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. బాలుడి కిడ్నాప్, హత్య కేసును ఛేదించేందుకు పోలీసు ప్రత్యేక బందాలు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మాలపల్లి మసీద్ వద్ద నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలుకా కేంద్రంలోని సరస్వతి నగర్‌కు చెందిన తల్లీకొడుకులు బోస్లే మాలాబాయి, బోస్లే గోపాల్ అనుమానాస్పదంగా తిరుగుతూ భిక్షాటన చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో కైలాశ్‌ను తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. పిల్లలతో కలిసి కమలాబాయి భిక్షాటనలో ఎక్కువ సంపాదిస్తుందనే అసూయ పెంచుకున్నట్లు తెలిపారు. గతంలో మాలబాయి భర్తను కమలాబాయి హత్య చేసిందనే అనుమానంతోనే కైలాశ్‌ను ఎత్తుకెళ్లి బండరాయితో మోది హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీపీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుళ్లు గంగారాం, రాంబాబు, రవి, అనూష్‌ను సీపీ అభినందించారు.